

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మింట్ కాంపౌండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 12 ఏప్రిల్ 2025 | HYDERABAD




బాక్స్ డ్రైన్ల నిర్మాణంతో వరద ముంపును నివారిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్‌లో రూ. 25 లక్షలతో, మచ్చ బొల్లారం డివిజన్ తుర్కపల్లి లో రూ.2. 48 కోట్లతో బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబితా కిశోర్, అనిల్ కిశోర్, విజయ శేఖర్, పోతురాజు, మొహసిన్, సురేశ్, జనార్దన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

-మల్కాజిగిరి, ఏప్రిల్ 11




## ఉస్మానియా దవాఖానకు 174 ఏండ్లు



ఉస్మానియా మెడికల్ కళాశాల 174వ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కోట్ల మందికి ఆశాదీపంగా ఉస్మానియా ఉందని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు.

- సిటీబ్యూరో, ఏప్రిల్ 11,(నమస్తే తెలంగాణ):



అడ్డగుట్టలో నిర్మాణం పూర్తికాని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్

# పేదోడి ఫంక్షన్ హాళ్లపై శీతకన్ను!

16 నెలలు దాటినా..

14 చోట్ల పురోగతి లేని పనులు

జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): నిరుపేదలు సైతం గర్వించే స్థాయిలో వేడుకలు నిర్వహించుకునేలా అధునిక హంగులతో నిర్మించ తలపెట్టిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్స్‌పై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను వేసింది. 16 నెలలుగా పురోగతిలో ఉన్న నిర్మాణాలను పూర్తి చేయడంలో విఫలమైంది. కొన్ని చోట్ల పనులను కనీసం పట్టాలెక్కించలేదు. ఒకేసారి రెండు వేల మందితో వేడుక నిర్వహించేలా సకల సౌకర్యాలతో గత కేసీఆర్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ వ్యాప్తంగా రూ. 90 కోట్లతో 31 చోట్ల మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాళ్లను నిర్మించాలని భావించి 2023 డిసెంబర్ నాటికి రూ. 30.10కోట్లతో 12 చోట్ల మల్టీపర్పస్ ఫంక్షఒన్‌హాళ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. నిర్మాణ దశలో 14 చోట్ల పనులు ఉండగా..16 నెలల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏడాదిన్నర కాలంగా ఈ 14 చోట్ల పనుల్లో ఏ ఒక్కచోటా అందుబాటులోకి తీసుకురాలేకపోయింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో ఇంజినీర్లు సైతం పురోగతిలో ఉన్న పనులను ముందుకు తీసుకువెళ్లలేక చాలా చోట్ల పనులను చేతులెత్తేశారు. కాంట్రాక్టర్లకు నిధుల లేమి సమస్య ఒకవైపు..మరోవైపు ఇంజినీర్ల అలసత్వం మరో వైపు వెరసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని బహుళ వినియోగ ఫంక్షన్ హాళ్లను సకాలంలో అందుబాటులోకి తీసుకువచ్చి వందలాది మందికి ప్రయోజనం చేకూర్చాలని నగరవాసులు కోరుతున్నారు.

| ప్రాంతం | పురోగతిలో ఉన్న పనులు (శాతంలో) |
|---|---|
| చాంద్రాయణగుట్ట, ఉప్పుగూడ మహంకాళి టెంపుల్ | 30 |
| జుమ్మెరాత్ బజార్ | 90 |
| అయ్యప్ప గ్రౌండ్, వెంగళ్‌రావు నగర్ | 65 |
| ఎర్రగడ్డ, జనప్రియ అపార్ట్‌మెంట్స్ | 15 |
| గాజులరామారం, సూరారం టీఎస్ఐఐసీ కాలనీ | 90 |
| సికింద్రాబాద్, అడ్డగుట్ట | 80 |

బార్కాస్, గౌస్ నగర్ ప్రభుత్వ పాఠశాల పక్కన, జంగమ్మెట్, లక్ష్మీనరసింహాస్వామి ఆలయం, కంచన్‌బాగ్, దర్గా బహానే షా శహబ్ రోడ్, మల్లెపల్లి, జకీర్ హుస్సేన్ కమ్యూనిటీ హాల్, సనత్‌నగర్, కైలాస్‌నగర్, బేగంపేట, పాన్‌బజార్ ప్రాంతాల్లో ప్రాథమిక దశలో ఉండటం గమనార్హం.



వెంగళ రావునగర్‌లో..



## పరిశుభ్రతలో నిర్లక్ష్యం

సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు కూకట్‌పల్లి ఉడిపి గ్రాండ్, కాప్రా స్వాగత్ గ్రాండ్, ఈ గ్యాలరియా, కోఠి ఉడిపి టిఫిన్స్, సంతోష్ బంజారా రెస్టారెంట్, మినర్వా గ్రాండ్, సైనీ దాబా, అంబర్‌పేట గ్రిల్ రెస్టారెంట్‌ల్లో తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉన్నట్లు తేల్చారు. సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం


## సన్నాహక సమావేశాలు

హాజరుకానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మేడ్చల్, ఏప్రిల్11(నమస్తే తెలంగాణ): ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ముందుస్తు సన్నాహక సమావేశాలను మేడ్చల్ జిల్లాలో నిర్వహిస్తున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే కూకట్‌పల్లి నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు నిర్వహించి క్యాడర్‌కు దిశా నిర్దేశం చేయగా, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. నేడు ఉప్పల్ నియోజకవర్గంలో నిర్వహిస్తుండగా, ఈ నెల 13 మల్కాజిగిరి, 14న మేడ్చల్ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారు. 'రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలివెళ్తాం. జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ భారీ సంఖ్యలో సభకు తరలించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు..' అని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. 'మల్కాజిగిరిలో 13న జరిగే సన్నాహక సమావేశానికి కేటీఆర్ రానున్నారు. కేటీఆర్ రాక సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గంలోని వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు ఉంటాయి.' అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.

## మీటర్ మారిస్తే ₹1500

చాయ్ పానీ ఖర్చులంట.. క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం



సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): గోల్నాక సెక్షన్‌లోని ఓ ఇంట్లో మీటర్ రీడింగ్ తీయడానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వచ్చాడు. మీటర్ మార్చుకోవాలంటూ సూచించాడు. ఆ తర్వాత డిజిటల్ మీటర్ తెచ్చిపెట్టాడు. ఇందుకోసం తనకు రూ.1200 ఫోన్‌పే చేయాలని అడిగాడు. ఎందుకంటే చాయ్ పానీ ఖర్చులన్నాడు. ఫోన్‌పేలో డబ్బులు తీసుకున్నాడు. మీటర్ తెచ్చిపెట్టి ఒక మీటర్ చేంజ్ పేరుతో ఉన్న డూప్లికేట్ రసీదు ఇచ్చాడు. దానిపై అసిస్టెంట్ ఇంజినీర్ ఆపరేషన్స్ అని ఉన్నచోట ఈ మీటర్ రీడరే సంతకం పెట్టి ఇచ్చాడు. ఇదంతా అంబర్‌పేట డివిజన్‌లో జరిగింది. ఇలా ఆ ఒక్క ఏరియాలోనే ఎనిమిది మంది వద్ద రూ.1200 నుంచి రూ.1500 వసూలు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు చెప్పినా తనకేం కాదని, ఇందులో వారికే పెద్ద వాటా ఉంటుందని ఆ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అంటున్నారని వారు పేర్కొన్నారు. మీటర్ ఛేంజ్ చేయాలంటే డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని , ఎస్పీడీసీఎల్ ఉచితంగా మీటర్ మార్చాలని ఉన్నా.. ఈ విధంగా వసూలు చేయడం ఏంటని అంబర్‌పేట సెక్షన్ అధికారులకు చెప్పినా ఫలితం లేదని సదరు వినియోగదారుడు వాపోయాడు.

### పై సిబ్బందికి వాటాలంటూ..

పాత మీటర్ల స్థానంలో డిజిటల్ మీటర్లు బిగిస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారంటూ అనేక ఫిర్యాదులున్నాయి. తమకు ఇచ్చే డబ్బుల్లో పై సిబ్బందికి కూడా వాటాలివ్వాలంటూ సదరు మీటరు బిగిస్తున్న సిబ్బందే చెబుతున్నారు. ఏఈలు సంతకం పెట్టి ఇవ్వాల్సిన రసీదును వీరే ఏకంగా సంతకాలు పెట్టి ఇస్తున్నారంటే దందా ఎంత బాహాటంగా నడుస్తుందో తెలుస్తోంది.

## గౌలిగూడ టు తాడ్‌బండ్

నేడు హనుమాన్ విజయయాత్ర..

20వేల మందితో పటిష్ట బందోబస్తు

సిటీబ్యూరో, ఏప్రిల్11(నమస్తే తెలంగాణ): నగరంలో శనివారం జరిగే హనుమాన్ విజయోత్సవ యాత్రకు 20వేల మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. సీసీ కెమెరాలతో పాటు డ్రోన్లతో నిఘా ఉంటుందని, హైదరాబాద్ సిటీ పరిధిలో 150, రాచకొండ, సైబరాబాద్‌ల నుంచి వచ్చే46 ర్యాలీలు ఈ యాత్రలో కలుస్తాయని ఆయన పేర్కొన్నారు. వీరహనుమాన్ విజయోత్సవ ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. గౌలిగూడ శ్రీరామమందిరం నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు సుమారు 12.2 కిలోమీటర్ల మేర యాత్ర జరగనున్నదని, ఉదయం 11 గంటలకు యాత్ర ప్రారంభమై రాత్రి 9గంటలకు ముగుస్తుందని, పుత్లిబౌలి, కోఠి, సుల్తాన్‌బజార్, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ అశోక్‌నగర్, గాంధీనగర్, కవాడిగూడ, బైబిల్‌హౌజ్, రాంగోపాల్‌పేట, ప్యారడైజ్ ప్రాంతాల మీదుగా యాత్ర జరుగుతుందని పోలీసులు తెలిపారు. విజయయాత్ర సందర్భంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

## లోన్లు ఇచ్చి సైబర్ మోసం

స్టాక్ ట్రేడింగ్‌లో బాధితులపై ఒత్తిడి

డబ్బులు లేకున్నా లోన్ వస్తుందంటూ ఆశ

ఉన్నది ఊడ్చేసేదాక వదలని నేరగాళ్లు

IIలో



## దంత వైద్యులేరీ?

జిల్లా మెడికల్ కళాశాలల్లో డెంటల్ డాక్టర్ల కొరత

ఖాళీల భర్తీపై కాంగ్రెస్ సర్కారు కాలయాపనIVలో





